కుట్టులో కనికట్టు!


కంభం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శిక్షణ పొందిన మహిళల నిరసన (ఫైల్)


శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

- శిక్షణ ఇచ్చారు.. మిషన్లు మరిచారు
- కుట్టు మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు
- నియోజకవర్గంలో శిక్షణ పొందిన మహిళలు 368
- కంభం, గిద్దలూరు, కొమరోలు శిక్షణ శిబిరాలు

కంభం:

'చేపలు పంపిణీ చేయడం కాదు.. చేపలు పట్టడం నేర్పించాలి'.. 'మహిళలను అన్ని విధాలా ఆదుకుంటాం. స్వయం ఉపాధి పొందేందుకు మహిళలకు నైపుణ్యమున్న విభాగాల్లో శిక్షణ ఇస్తాం..' ఇవీ కూటమి ప్రభుత్వ పెద్దలు తరచూ వేదికలపై చెబుతున్న మాటలు. నేతల ప్రకటనలు కోటలు దాటుతున్నాయి కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. కుట్టు మిషన్ శిక్షణ పేరుతో ప్రభుత్వం, ఏజెన్సీ వారు కలిసి మాయ చేయడంపై మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. శిక్షణ పొందిన మహిళలకు ఆగస్టులో కుట్టుమిషన్లు అందిస్తానని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఆసక్తి కలిగిన మహిళలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలో కంభం, కొమరోలు మండలంలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయగా కంభంలో 144 మందిని, కొమరోలులో 90 మందిని, గిద్దలూరులో 140 మందిని ఎంపిక చేసి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. 70 శాతం హాజరు ఉన్న మహిళలకు శిక్షణ అనంతరం ఆగస్టు 15న కుట్టుమిషన్లు ఇస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఎప్పుడిస్తారో అర్థం కావడం లేదని, ఏజెన్సీ వారిని అడుగుతున్నా వారు కూడా స్పందించడం లేదని పలువురు మహిళలు వాపోతున్నారు. మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ ఇచ్చేందుకు ఒక ట్రైనర్‌ను, హాజరు, ఇతర పనుల నిమిత్తం ఒక ఆపరేటర్‌ను నియమించారు. ట్రైనర్‌కు రూ.12 వేలు, ఆపరేటర్‌కు రూ.10 వేలు జీతం ఉండగా వారికి ఒక నెలకు సంబంధించిన వేతనం మాత్రమే ఇచ్చినట్లు తెలిసింది. వాటర్ బిల్లులు కూడా చెల్లించలేదని చెబుతున్నారు. తమ పెండింగ్ వేతనం వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. ఇదిలా ఉండగా కుట్టు మిషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శిక్షణ పొందిన పలువురు మహిళలు ఈ నెల 8వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలు శిక్షణ ఇచ్చి మిషన్లు ఇస్తామన్నారని, అదనంగా మరో నెల శిక్షణ ఇచ్చినప్పటికీ నేటికి కుట్టు మిషన్లు ఇవ్వకపోవడం అన్యాయమని ఎంపీడీఓకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

నియోజకవర్గంలో కుట్టు మిషన్ శిక్షణ వివరాలు

మండలం	మహిళల సంఖ్య
కంభం	144
కొమరోలు	90
గిద్దలూరు	134

కుట్టుమిషన్లు అందించాలి
ఎస్‌జీఓ హోమ్‌లో 3 నెలలపాటు శిక్షణ ఇచ్చారు. ఆగస్టులో మిషన్లు ఇస్తామని చెప్పారు. కుట్టు మిషన్లు ఇస్తే జీవనోపాధికి కొంతైనా ఆసరాగా ఉంటుంది. వెంటనే కుట్టు మిషన్లు అందించేలా చర్యలు తీసుకోవాలి.
– జరీనా, కంభం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం
శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వలేదు. మహిళలు వినతి పత్రాలు అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తాం.
– వీరభద్రాచారి, ఎంపీడీఓ కంభం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు 'అన్నా' పరామర్శ


బాషాతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: పొదిలి పట్టణం 17వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బాషా ఇటీవల గ్రానైట్ క్వారీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరగడంతో చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు మంగళవారం బాషాను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, యోగక్షేమాలు తెలుసుకొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఉడుముల వరలక్ష్మమ్మ, మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు.

జెడ్పీ పాఠశాలలో దంత వైద్య శిబిరం


విద్యార్థులకు టూత్ పేస్టులు అందిస్తున్న డాక్టర్

కొనకనమిట్ల: మండలంలోని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మార్కాపురం పట్టణ దంత వైద్యుడు ఎన్‌వీబీఎల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా టూత్ పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మండ్ల రామాంజనేయులు, వెంకటసత్య రమేష్, సునీత, కొండలరావు, అక్కల నారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దసరా సెలవులపై పునఃసమీక్షించాలి


మార్కాపురం టౌన్: పాఠశాలలకు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించడంపై ప్రభుత్వం పునరాలోచించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నారని, విజయదశమి మరుసటి రోజున మన రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో కరి పండగ నిర్వహించుకుంటారని, ఈ నేపథ్యంలో హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ నెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ కమిటీ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చేలా విజిలెన్స్ కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు రేషన్, గ్యాస్ సరఫరా సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు పనికి తగ్గ వేతనం అందించేలా చూడాలన్నారు. సభ్యులు సూచించిన పలు సమస్యలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులు, యంఈఓలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆహార సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాదిన్నరగా సమావేశాలు పెట్టలేదని, బ్లాక్ మార్కెట్‌కు భారీగా రేషన్ తరలిపోతోందన్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు పెట్టడం ద్వారా కనీసం కొన్ని సమస్యలైనా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. కొందరు డీలర్లు రేషన్ ఇవ్వకుండా డబ్బు చేతికిచ్చి కార్డుదారులను వెనక్కి పంపుతుండటాన్ని ప్రశ్నించారు. స్టాక్ పాయింట్‌లో బియ్యం బస్తాలను తూకం వేయకుండా ఇస్తున్నారని డీలర్ల యూనియన్ నాయకులు తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ సక్రమంగా చేయడం లేదన్నారు. గ్యాస్ సిలిండర్ల ట్రాన్స్‌పోర్ట్ కోసం రూ.40 ఎక్కువగా తీసుకుంటున్నారన్నారు. వ్యాపారులు గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్లు వినియోగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రతి నెల 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ పంపిణీ చేయకపోవడంతో టీహెచ్‌ఆర్ పంపిణీలో ఇబ్బందులు పడుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ జీ భారతిభాయ్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ గిరిధర శర్మ

రాచర్ల: మండలంలోని యడవల్లి, చెర్లోపల్లె గ్రామాల్లోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఎంఈవో–2 వారణాసి గిరిధర శర్మ తనిఖీ చేశారు. తొలుత పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాజరు పట్టీలు, మధ్యాహ్న భోజనం రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని, ఈ విద్యా సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్.షేక్షావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కంభం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో వెల్ బీయింగ్ ఔట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల వద్ద ఉన్న పాత పుస్తకాలు సేకరించి వాటి స్థానంలో కొత్త పుస్తకాలు అందించేందుకు ముందుకు వచ్చారు. పేపర్ తయారీలో భాగంగా వృక్షాల నరికివేతను అరికట్టే దిశగా పాత పుస్తకాలను రీసైక్లింగ్ చేస్తారని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములవుతారన్నారు.

నేడు కంభంలో జోనల్స్ పోటీలు


మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు, పీడీలు

కంభం:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని పీడీలతో సమావేశం నిర్వహించి మైదానాన్ని పరిశీలించారు. అండర్–14, అండర్–17 బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్ విభాగాల్లో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నామన్నారు. మండల స్థాయిలో విజేతలను డివిజన్ లెవెల్ పోటీలకు పంపుతామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతే దేశాభివృద్ధికి మూలం


సాంకేతిక పరిజ్ఞానంపై బుక్‌లెట్ ప్రదర్శిస్తున్న కళాశాల సిబ్బంది, బ్యాంకు అధికారులు

మార్కాపురం టౌన్: దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త విధానాలను సంతరించుకుంటూ శరవేగంగా దూసుకువెళ్తున్న తరుణంలో విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కర్నూల్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూదన్ ఆధ్వర్యంలో డిగ్రీ 2, 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాలపై సమగ్ర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికంగా వచ్చిన అన్ని ఆర్థిక లావాదేవీలు, యాప్‌ల వివరాలు తెలుసుకుంటూ ఖాతా నిర్వహణను సక్రమమైన మార్గంలో నడిపించాలని తద్వారా ఏ కుటుంబం ఆర్థికంగా నష్టపోదని తెలిపారు. ఏపీజీబీ నిర్వహణాధికారి ఇ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సాంకేతిక ఆర్థిక లావాదేవీల విషయంలో బ్యాంకింగ్ రంగంలో పనిచేసిన సీనియర్ అధికారులు సైతం మోసపోతున్నారని, విద్యార్థి దశ నుంచే అవగాహన పొందడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. యూనియన్ బ్యాంకు నిర్వహణాధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో సైబర్ క్రైం స్థాయి అంతకంతకు పెరుగుతుందని విద్యార్థులు సాంకేతిక ఆర్థిక వివరాలపై కచ్చితమైన విశ్లేషణ జరపాలన్నారు. కార్యక్రమంలో కృష్ణచైతన్య, పి శ్రీకాంత్ నెహ్రూ, ఎస్.హరి, ఏపీఎం పిచ్చయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, వి.అశోక్‌కుమార్, పి.మల్లికార్జున, విజయ్‌కుమార్, కె.అశోక్, శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ తొట్టెలతో.. పశువుల దాహార్తి తీరేదెలా?


సత్యవోలుతో నీరు లేకపోవడంతో ఖాళీగా ఉన్న పశువుల తొట్టె


అనుములపల్లెలో చుక్కనీరు లేని పశువుల తొట్టె

రాచర్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూటమి ప్రభుత్వం పశువులు నీరు తాగేందుకు నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రాచర్ల మండలంలో 37 పశువుల నీటి తొట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.14 లక్షలు ఖర్చు చేసింది. ఆకవీడు పంచాయతీలో 3, అనుములపల్లె 2, చినగానిపల్లె 2, చోళ్లవీడు 3, యడవల్లి 5, గౌతవరం 1, గుడిమెట్ట 1, జేపీ చెరువు 1, కాలువపల్లె 3, ఒద్దులవాగుపల్లె 1, పాలకవీడు 3, రాచర్లలో 6, సత్యవోలు 5, సోమిదేవిపల్లెలో 1 చొప్పున తొట్లు మంజూరయ్యాయి. ఆకవీడు, అనుములపల్లె, చోళ్లవీడు, గుడిమెట్ట, కాలువపల్లె, సత్యవోలు గ్రామాల్లో పశువుల తొట్లు పూర్తి కాగా వాటిలో చుక్కనీరు కూడ కనిపించడం లేదు. మీగతా గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల తొట్టెల్లో నీరు నింపి వాటి దాహార్తి తీర్చాలని పశుపోషకులు కోరుతున్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఆటో కార్మికులు

మార్కాపురం: ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ, ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు పథకం వలన ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఉపాధి దూరమైందన్నారు. ఆటోలకు బాడుగలేక కార్మికులు పస్తులతో గడుపుతున్నారన్నారు. ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకున్న డ్రైవర్లు నెల నెలా కిస్తీలు చెల్లించలేక ఇబ్బంది పడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన మిత్ర పథకం కింద ఆటో కార్మికులకు ఏడాదికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని, ఫైనాన్స్‌లో తీసుకున్న వాహనాల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో రూబెన్, బాషా, నారాయణరెడ్డి, సాంబశివ, అంకిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన టెన్నిస్ క్రీడాకారులు

గిద్దలూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లబ్ రోడ్డులో గల టెన్నిస్ కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన టోర్నమెంట్ ఉత్సాహభరితంగా కొనసాగింది. పోటీలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అండర్ 14 బాలుర విభాగంలో ఎం.తనుష్‌యాదవ్, ఎం.వి.తేజస్వియాదవ్, డి.రిచర్డ్‌లేవీ, ఎం.భార్గవ్, అండర్ 14 బాలికల విభాగంలో ఎం.యశోదాదేవి, శల్విక, అండర్ 17 బాలుర విభాగంలో మహ్మద్ ఖుర్షీద్, ఇ.రోహన్‌రంగా, డా.నాగ్, జి.శ్రీరంగ ఆదిత్య, అండర్ 17 బాలికల విభాగంలో ఎం.భావనాదేవి ఎంపికయ్యారు. వీరు త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు గుర్రం శోభన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో లాన్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు జి.కె.మోహన్‌రెడ్డి, టెన్నిస్ కోచ్ మురళీరెడ్డి, సీనియర్ క్రీడాకారుడు కోటయ్యగౌడ్, ఎంఈఓలు అశ్వినికుమార్, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్తీశ్వర క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి


విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న దినకర్

బేస్తవారిపేట/కంభం: ప్రసిద్ధి చెందిన పురాతన ముక్తీశ్వర క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను మోక్షగుండం గ్రామస్తులు కోరారు. మంగళవారం మోక్షగుండంలో పర్యటించిన ఆయన భారతరత్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముక్తీశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాకర్ల గ్రామంలో వెలిగొండ ప్రాజెక్టు గ్యాప్ను, కంభం చెరువును సబ్ కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి గైర్హాజరైన వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ జితేంద్రకుమార్, డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు


సీడీపీఓ పద్మావతి

మార్కాపురం: ఈనెల 15 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం సీడీపీఓ ఎం.పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణ, మాతా శిశు మరణాలు తగ్గించడం, పౌష్టికాహారం అందజేతపై మాసోత్సవాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. మార్కాపురం టౌన్, మండలం, తర్లుపాడు మండలాల్లోని 208 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు తదితర తృణ ధాన్యాలతో ఎటువంటి పదార్థాలు తయారు చేసుకోవచ్చు వివరిస్తున్నామన్నారు. ఈ మాసోత్సవాల్లోనే స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. పోషకాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తామన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

రాచర్ల: ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంఈవో–2 వారణాసి గిరిధర శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధార్ కార్డుల్లో ఏమైనా సవరణలుంటే ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాలకు వెళ్లి ఆధార్ కార్డులు సరిచేసుకోవాలని సూచించారు.




మూలేవారిపల్లి, గొంటువానిపల్లి రహదారి దుస్థితి


చిత్తడిగా మారిన గొంటువానిపల్లి ప్రధాన కూడలి


బురదమయంగా మారిన వీధి

చినుకు పడితే చిత్తడే!

- పెదారికట్ల పంచాయతీలో దారుణంగా అంతర్గత రోడ్లు
- నడిచేదెలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కొనకనమిట్ల: పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్నట్టుంది కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల పంచాయతీ పరిస్థితి. పెదారికట్ల పంచాయతీ పక్కనే ఉన్న గొంటువానిపల్లి, మూలేవారిపల్లికి వెళ్లే రహదారులు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతున్నాయి. ఓ మోస్తరు వర్షం పడితే గ్రామంలోని వీధుల్లో బురద వరదలా మారుతోంది. వీధుల్లో వర్షం నీరు నిల్వ ఉండటం, దోమలు వ్యాప్తి చెందడం, దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అంగర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫారెస్ట్ సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ పరిధిలోని ప్రాజెక్టు టైగర్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రజా సంబంధాల సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అటవీశాఖ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా బ్యాచ్‌లర్స్ లేదా మాస్టర్ డిగ్రీ, ఎంబీఏ, పబ్లిక్ రిలేషన్ అండ్ మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, సున్నిపెంట కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు. ఈనెల 24న రాత పరీక్ష, కంప్యూటర్ టెస్టు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు మార్కాపురం డీఆర్‌ఓ 63039 97123, కలనూతల ఫారెస్టు బీట్ ఆఫీసర్ 98669 04600ను సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యం సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాలు

దర్శి: డిగ్రీస్థాయిలో నైపుణ్యాలు సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాల అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరియర్ గైడెన్స్ సెల్ డాక్టర్ కె.హైమావతి సూచించారు. స్థానిక కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ నైపుణ్యాలు సాధించే విధానం గురించి వివరించారు. విద్యార్థులకు మరింత సమాచారం కోసం వారు నడుపుతున్న కెరియర్ మైండ్స్ అనే ఒక పోర్టల్ గురించి పిల్లలకు వివరించారు. సీపీడీసీ మెంబర్ జీవీ రత్నం, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఏ నగేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.వేణు, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, కెమిస్ట్రీ అధ్యాపకులు ఎల్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.